క్లుప్తంగా

ర్యాకల్ రిజర్వాయర్ తూముకు మరమ్మతులు


తూమును పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని గంగాపూర్ శివారులోని ర్యాకల్ రిజర్వాయర్‌కు నీటి పారుదల శాఖ అధికారులు మరమ్మతులు చేశారు. తూము షట్టర్ పాడవ్వడంతో నీరు వృథాగా పోతోందని నెలకిందట రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన అధికారులు మంగళవారం రిజర్వాయర్‌ను సందర్శించి తూముకు సంబంధించిన పాత షట్టర్‌ను తొలగించి కొత్త షట్టర్‌ను బిగించారు. అదేవిధంగా రిజర్వాయర్ కట్టపై గొయ్యి ఏర్పడడంతో మరమ్మతులు చేసి పూడ్చారు.

మొక్కలు నాటే పనులు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

కంది(సంగారెడ్డి): హరితహారంలో భాగంగా వచ్చే నెల15వ తేదీలోపు అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే పనులను పూర్తి చేయాలని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. బుధవారం కందిలోని ఎంపీపీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందునా ప్రతి గ్రామంలో 8వేల మొక్కలను నాటడమే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ మహేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

సోలిపేట రామచంద్రారెడ్డికి నివాళి

నారాయణఖేడ్: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం చిట్టాపూర్‌కు చెందిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే, మాజీ రాజ్యసభ సభ్యులు సోలిపేట రామచంద్రారెడ్డి ఇటీవల మృతి చెందిన విధితమే.. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి వెళ్లి రామచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యుడిగా ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కొనియాడారు.

గిరిజనులకు అన్యాయం చేస్తే సహించం


పట్టాదారు పాసుపుస్తకాన్ని చూపిస్తున్న రాములునాయక్

కోహీర్(జహీరాబాద్): అక్రమంగా గిరిజనుల భూములను అక్రమించుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కోహీర్ ఎస్‌ఐ సురేష్‌తో మాట్లాడారు. మనియార్‌పల్లి తండాకు చెందిన కేతవత్ బద్రీబాయి, కేతవత్ షెట్టినాయక్, కేతవత్ పూర్యానాయక్‌లకు సర్వే నంబర్ 64లో ఐదెకరాల భూమిని 70 ఏళ్ల క్రితం ప్రభుత్వం కేటాయించగా నాటి నుంచి నేటివరకు గిరిజనులు ఆ భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ క్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్ రాంరెడ్డితో పాటు మరికొందరు నాయకులు పాత రికార్డులతో పట్టాలు సృష్టించి గిరిజనుల పంటలను ధ్వంసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 15 రోజుల క్రితం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. గిరిజనులకు అన్యాయం చేయాలని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు.

దిమ్మెకూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

నారాయణఖేడ్: జనగామ కలెక్టరేట్ ఎదుట దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు నిర్మించిన గద్దెను కూల్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నారాయణఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు చెట్టుకింది జ్ఞానేశ్వర్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం దొడ్డి కొమురయ్య అమరత్వాన్ని గుర్తించి జయంతి, వర్ధంతులను అధికారంగా నిర్వహిస్తుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా కొందరు అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. కూల్చిన గద్దెను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పనిచేయకపోతే బదిలీపై వెళ్లండి

- అధికారుల పనితీరుపై ఎంపీపీ గిరిధర్‌రెడ్డి అసహనం
- వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విషయంలో పనిచేసే ఉద్దేశం లేకపోతే బదిలీపై వెళ్లండని అధికారుల తీరుపై ఎంపీపీ గిరిధర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత సమావేశంలో వచ్చిన సమస్యలను పరిష్కరించే విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. రెవెన్యూ, ఫారెస్టు, విద్యుత్ శాఖల సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. మల్‌చల్మ సర్పంచ్ పాండురంగారెడ్డి, ఎంపీటీసీలు నర్సింహులు, ఇస్మాయిల్‌లు మాట్లాడుతూ జహీరాబాద్ నుంచి మల్‌చల్మ వరకు 12కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.4.36 కోట్లు మంజూరై 5నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించడంలేదని వాపోయారు. కనీసం దెబ్బతిన్న రహదారిపై ప్యాచ్ పనులు కూడా చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కొత్తూర్(బీ) సర్పంచ్ జగన్ మాట్లాడుతూ తమ గ్రామంలోని ప్రధాన రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా రోడ్డు నిర్మించడం లేదన్నారు. ఆర్అండ్‌బీ డీఈఈ నర్సింహులు మాట్లాడుతూ పలు ఇబ్బందులతో జాప్యం జరుగుతుందని చెబుతుండగా ఎంపీపీ గిరిధర్‌రెడ్డి స్పందిస్తూ పనిచేసే విషయంలో చిత్తశుద్ధి లేకుండా అధికారులు బదిలీపై వెళ్లిపోవచ్చన్నారు. ఎంపీటీసీ నర్సింహులు మాట్లాడుతూ శేఖాపూర్ గ్రామంలో ఫారెస్టు భూములు లేకున్నా అధికారులు సరిహద్దులు గుర్తిస్తున్నారని ఆరోపించగా రెవెన్యూ, ఫారెస్టు అధికారులు కలిసి సర్వేచేసి సమస్య పరిష్కరించాలని ఎంపీపీ గిరిధర్‌రెడ్డి సూచించారు. ఉపాధిహామీ బిల్లులు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని అల్గోల్ సర్పంచ్ జ్యోతి పేర్కొన్నారు. శేఖాపూర్‌లో నీటి ఇబ్బందులు తీర్చేలా చూడాలని ఎంపీటీసీ కోరారు. చెరువుల పండుగ కోసం రూ.లక్ష నిధులు ఇస్తామని చెప్పి ఇవ్వలేదని, ఈ విషయంలో ఎవరూ పట్టించుకోవడంలేదని మల్‌చల్మ సర్పంచ్ పాండురంగారెడ్డి వాపోయారు. చిరాగ్‌పల్లిలో అధికారులు భూసమస్యలు పరిష్కరించడంలేదని సర్పంచ్ నర్సింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ నాగిశెట్టిరాథోడ్, ఎంపీడీఓ సుమతి, వైస్ ఎంపీపీ రాములు, ఎంపీటీసీలు స్వరూప, అరుణజ్యోతి, లీలావతి, పార్వతి, సర్పంచ్‌లు విజయలక్ష్మి, కర్నెరాజు, మాణిక్‌రెడ్డి, రమేష్, నర్సింహారెడ్డి, శెట్టి రాథోడ్, అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ తహసీల్దార్ శివప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యచరణ సమితి ఇచ్చిన పిలుపుమేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట రిటైర్డ్ ఉద్యోగులు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినా స్పందన లేదన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షన్, నగదు రహిత చికిత్స వర్తింపచేయాలని తెలిపారు. ప్రతి జిల్లాలో 2 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి జూలై 12న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు పెన్షనర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

గుంతల్లో ఇరుక్కున్న లారీ

ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు


లారీని క్రేన్ సహాయంతో తొలగిస్తున్న వాహనదారులు

పటపల్లి(అందోల్): అల్లాదుర్గ్ నుంచి మెటల్‌కుంట వెళ్లే ప్రధాన రహదారిపై మండల పరిధిలోని మేడికుందా గ్రామ శివారులో బుధవారం రోడ్డుపై ఉన్న గుంతలో ఇసుక లారీ ఇరుక్కుంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి నీరు రోడ్డుపై ఉన్న గుంతలో చేరింది. ఈ క్రమంలో ఇసుక లోడుతో వెళ్తున్న లారీ గుంతలను తప్పించే క్రమంలో ఒకవైపు ఒరిగింది. దీంతో గంటల తరబడిగా వాహనం రోడ్డుపైనే ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లారీని క్రేన్ సాయంతో తొలగించడంతో ట్రాఫిక్ క్లియర్ అయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని ధర్నా


ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో 75 శాతం స్థానిక పేదలకు కేటాయించాలని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రాపురం పరిధిలోని కొల్లూరులో ఇటీవలే సీఎం కేసీఆర్ ప్రారంభించిన 16వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను స్థానికులకే 75 శాతం కేటాయించాలని, అర్హులైన పేదలకు పారదర్శకంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి అంజిరెడ్డి, ఎడ్ల రమేశ్, పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు మోహన్‌గౌడ్, పటాన్‌చెరు అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత


అక్రమ కట్టడాల కూల్చివేతను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లారెడ్డి

జహీరాబాద్: మున్సిపల్ పరిధిలోని 65వ జాతీయ రహదారిని ఆక్రమించి అక్రమంగా నిర్మించిన కట్టడాలను కమిషనర్ మల్లారెడ్డి పర్యవేక్షణలో బుధవారం కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యించారు. బీదర్ క్రాస్‌రోడ్డుతో పాటు రహదారికి ఇరువైపులా ఉన్న నిర్మాణాలను అనుమతులు లేకుండా నిర్మించడంతో కూల్చివేసినట్లు తెలిపారు.

భారీ వర్షానికి సంకేతం


ఝరాసంగం(జహీరాబాద్): ఆకాశంలో కారు మబ్బులు ఏర్పడి భారీ వర్షానికి సంకేతం ఇచ్చాయి. బుధవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో సాయంత్రం ఆకాశంలో ఇలా నల్లటి మబ్బులు ఏర్పడ్డాయి. దీంతో భారీ వర్షం కురుస్తుందని రైతులు చర్చించుకున్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ


జిన్నారం: విద్యార్థులతో సాయిగౌడ్


మునిపల్లిలో..

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు, బ్యాడ్జీలను గ్రామానికి చెందిన గ్రామస్తుడు రవి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది విజయలక్ష్మి, బాగయ్య, జగదీశ్వర్, మమత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని ఖమ్మంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్కూల్ యూనిఫాంను విద్యా కమిటీ చైర్మన్ నర్సింహులు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఖమ్రొద్దీన్, విద్యా కమిటీ సభ్యులు రాజేందర్, ఉపాధ్యాయులు గోపాల్, ప్రీతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగ్‌ల అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని రాళ్లకత్వ గ్రామంతో పాటు స్థానిక తండాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్థానిక యువజన నాయకుడు సాయిగౌడ్ తన సొంత నిధులతో బుధవారం స్కూల్ బ్యాగులను అందజేశారు. అనంతరం సాయిగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వాలంటీర్‌కు ఆర్థికసాయం చేయాలని పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి సాయిగౌడ్‌ను కోరగా స్పందించిన ఏడాది పాటు ప్రతి నెల రూ.1000 వాలంటీర్‌కు ఇచ్చేందుకు ఆయన అంగీకరించారు. దీంతో సాయిగౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు తనవంతు సహాయ, సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాండు, బిక్షపతి, మల్లేశ్ పాల్గొన్నారు.

సింగితం గ్రామంలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో త్రిష దామోదర్, నాయకులు

రాయికోడ్(అందోల్): మండలంలోని సింగితం గ్రామంలో కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు అవుసలి ప్రభాకర్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయా గ్రామాల యువకులు రక్తదానం చేశారు. మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ కూతురు త్రిష దామోదర్ ప్రభాకర్ జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్, మండల అధ్యక్షుడు అంజయ్య, నర్సింలు పాల్గొన్నారు.

పాకో మిషన్ ప్రారంభం


పాకో మిషన్‌ను ప్రారంభిస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటీ: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు వర్చువల్ గా పాకో మిషన్ మిషన్‌ను బుధవారం బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్, డీఎంహెచ్ఓ డాక్టర్ గాయత్రి, సంగారెడ్డి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాణి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రవికుమార్, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సంగారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నరహరి రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **అభివృద్ధికి సహకరించాలి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కార్పొరేటర్ వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి అన్నారు. బుధవారం భారతి నగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు కార్యాలయంలో అన్ని శాఖల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కారించాలని సూచించారు. వార్డు అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

◆ **బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్**

సంగారెడ్డి టౌన్: బక్రీద్ పండుగ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ శరత్ జిల్లాలోని ముస్లింలకు బుధవారం బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలందరూ బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

◆ **బక్రీద్ పండగ ఏర్పాట్ల పరిశీలన**

రామచంద్రాపురం(పటాన్‌చెరు) పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఈద్గాలో బక్రీద్ పండగ సందర్భంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఏర్పాట్లను బుధవారం కార్పొరేటర్ పుష్పనగేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ముస్లింలకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు.

◆ **జ్ఞాన సంపదను పెంచుకోవాలి**



పటపల్లి(అందోల్): విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించి జ్ఞాన సంపదను పెంపొందించుకోవాలని జోగిపేట లైబ్రేరియన్ రాజ్‌కుమార్ అన్నారు. జోగిపేటలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాధాబాయితో కలిసి విద్యార్థులు బుధవారం గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పుస్తకాలను పఠనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందరికీ అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు పుస్తకపఠనం అలవర్చుకోవాలని సూచించారు.

◆ **అంత్యక్రియలకు ఆర్థికసాయం**

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్‌లో నివాసం ఉండే సుధాకర్ అనే వ్యక్తి బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి అంత్యక్రియలకు కౌన్సిలర్ చంద్రారెడ్డి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

◆ **జూలై 2న క్విజ్ పోటీలు**

జిన్నారం(పటాన్‌చెరు): వచ్చే నెల జూలై 2న రాజీవ్‌గాంధీ యూత్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ తెలిపారు. క్విజ్ పోటీల నిర్వహణపై బుధవారం జిన్నారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డె కృష్ణ మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో పాల్గొనాలనుకునే యువకులు యూత్ కాంగ్రెస్ నాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **అధిక ఫీజులను నియంత్రించాలి**

నారాయణఖేడ్: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఖేడ్‌లో ఆ సంఘం డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులతో పాటు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని వాపోయారు. పాఠశాలల వద్ద తరగతుల వారీగా ఫీజుల పట్టికలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలను ఉల్లంఘించే పాఠశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ నాయకులు ప్రేమ్, మహేష్, సందీప్ పాల్గొన్నారు.

◆ **గురుకులాన్ని సందర్శించిన బీఎస్పీ నాయకులు**

నారాయణఖేడ్: మండలంలోని జూకల్ శివారులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను బుధవారం ఖేడ్ నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షుడు పుప్పాల అశోక్, ఖేడ్ మండల శాఖ అధ్యక్షుడు అనుముల తుకారాం తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా బియ్యం, పప్పులు, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

◆ **ప్రత్యేకంగా చెత్త సేకరణ వాహనాలు**

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో బక్రీద్ పండుగను పురస్కరించుకొని గురువారం నుంచి ప్రత్యేక చెత్త సేకరణ వాహనాలను ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా బుధవారం ఖేడ్‌పట్టణ శివారులోని ఈద్గాలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అనంతరం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ వ్యర్థాలు, చెత్తను బయట వేయకుండా కాలనీలకు వచ్చే చెత్త సేకరణ ఆటోల్లోనే వేయాలని కాలనీవాసులకు సూచించారు. శానిటరీ అధికారి శ్రీనివాస్ పనులను పర్యవేక్షించారు.

◆ **తప్పిన పెను ప్రమాదం**

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌కు చెందిన మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్ సోదరుడు, ఖేడ్ మాజీ జెడ్పీటీసీ సంగీతాషెట్కార్ భర్త జితేంద్రనాథ్ షెట్కార్ ప్రయాణిస్తున్న కారును బుధవారం ఎదురుగా వస్తున్న కారు ఢీకొనగా పెను ప్రమాదం తప్పింది. కారులో హైదరాబాద్ నుంచి నారాయణఖేడ్‌కు వస్తుండగా ఖేడ్ మండలం దర్గాతండా వద్ద జాతీయ రహదారిపై కల్హేర్ మండలం మునిగేపల్లికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి కారు నడుపుతూ ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో జితేంద్రనాథ్ షెట్కార్ కారులో ఉన్న మూడు ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో జితేంద్రనాథ్ షెట్కార్‌కు ప్రమాదం తప్పింది.

◆ **ఉత్తమ అవార్డు గ్రహీతలకు సత్కారం**



జహీరాబాద్: ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన ప్రజాప్రతినిధులను, అధికారులను ఘనంగా సత్కరించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ గిరిధర్ రెడ్డి జహీరాబాద్ ఎంపీడీఓ సుమతి, కొత్తూర్(బీ) సర్పంచ్ జగన్మోహన్, శేఖాపూర్ సర్పంచ్ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మిలను శాలువా, బొకేలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగిశెట్టి రాథోడ్, ఎంపీఓ మహేష్ పాల్గొన్నారు.

◆ **పేదలకు వరం సీఎం సహాయనిధి**

కోహీర్(జహీరాబాద్): సీఎం సహాయనిధి పేదల పాలిట వరమని కోహీర్ నంబర్ 2 ఎంపీటీసీ కౌసర్ అన్సస్ అన్నారు. కోహీర్ పట్టణంలోని ఖస్బ వాడకు చెందిన మహమ్మద్ షోయబ్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేదలైన షోయబ్ తల్లిదండ్రులు చికిత్స ఖర్చుల నిమిత్తం ఎంపీ బీబీ పాటిల్‌ను ఆశ్రయించగా తక్షణసాయం కింద సీఎం సహాయనిధి నుంచి రూ.2.50 లక్షలు మంజూరు చేయించారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు ఎంపీ బీబీ పాటిల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

◆ **మౌలిక వసతులు కల్పించాలి**

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడులు సమస్యలకు నిలయాలుగా మారాయన్నారు. చాలాచోట్ల మూత్రశాలలు కూడా లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆయా పాఠశాలల్లో టీచర్లతో పాటు సిబ్బంది కొరత ఉందన్నారు. పాఠశాలలు ప్రారంభమై 18 రోజులు గడుస్తున్నా నేటికీ పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తికాకపోవడం విచారమని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అఖిల్, సంతోష్‌రెడ్డి, చంద్రకాంత్, రఘు, నరేష్, దినకర్ పాల్గొన్నారు.

◆ **చెరకు మద్దతు ధర పెంచడం హర్షణీయం**

జహీరాబాద్ టౌన్: కేంద్ర ప్రభుత్వం చెరకు మద్దతు ధర పెంచడం హర్షణీయమని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పట్లోల ప్రశాంత్ పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూలేని విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం టన్నుకు చెరకు మద్దతు ధర రూ.315 పెంచిందన్నారు. దీంతో దేశంలోని 5కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ **వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి**

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా సదాశివపేట పట్టణానికి చెందిన శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డిని బుధవారం రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి, కొండాపూర్ జెడ్పీటీసీ పాండు పాల్గొన్నారు.